గురుకుల విద్యాపీఠ్

క్రమశిక్షణ.. ఉత్తమ విద్యతో అద్భుత ఫలితాలను సాధిస్తూ గురుకుల విద్యాపీఠ్ పాఠశాల దినదినాభివృద్ధిగా విరాజిల్లుతున్నది. ఈ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకూ పెద్దపీట వేశారు. స్వర్గీయ గొల్లపూడి రాందాస్, పుష్పాంజలి గార్లు 1992లో ఈ విద్యాలయాన్ని స్థాపించారు. అప్పటి నుంచి గురుకుల విద్యాపీఠ్ ఫలితాల సాధనలో తనకు తానే సాటిగా నిలిచింది. ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో ఈ పాఠశాల ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్నది. విద్యార్థినీ విద్యార్థులు టెన్త్‌లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం ఈ పాఠశాలకే సాధ్యం..

- హంగూఆర్భాటాలకు ఇక్కడ తావు లేదు..
- ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ..
- గ్రామీణ పేద విద్యార్థులకు చేయూత..
- ముప్పై ఏండ్ల ప్రస్థానంలో ఎంతోమంది బంగారు భవిష్యత్తుకు బాటలు..
- విద్యావేత్త చుక్కారామయ్య, శ్రీనివాస్‌రావు నేతృత్వంలో అద్భుత ఫలితాలు..
- విద్యతో పాటు క్రీడలకు పెద్దపీట

ఇబ్రహీంపట్నం, జూన్ 24 : చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో గురుకుల విద్యాపీఠ్ పాఠశాల కొనసాగుతున్నది. తమ పిల్లలు క్రమశిక్షణతో మెలగడమే కాకుండా అనుకున్న ర్యాంకులు సాధిస్తారని విద్యార్థుల తల్లిదండ్రుల్లో దృఢమైన నమ్మకం కలిగిన విద్యాసంస్థ గురుకుల విద్యాపీఠ్. విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా భావించి, వారిని అన్ని రంగాల్లో ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్ది, దేశానికి అందిస్తున్న పాఠశాల గురుకుల విద్యాపీఠ్ అని చెప్పుకోవచ్చు. పాఠశాలలో విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతారు. హైదరాబాద్ నాగార్జున్‌సాగర్ హైవేపై ముప్పై కిలోమీటర్ల దూరంలో ఖానాపూర్ గేటు సమీపంలో విశాలమైన ప్రదేశంలో చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో ఈ పాఠశాలను 1992లో ఏర్పాటు చేశారు. నగర యాంత్రిక జీవితానికి దూరంగా చక్కటి వాతావరణంలో ఉన్న ఈ పాఠశాలలో రాష్ట్రం నలుమూలలతోసహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థినీవిద్యార్థులు కూడా విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. అలాగే, పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ ఉద్యోగాలను కూడా సంపాదించారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులకు అక్కడే ఉండేలా క్వార్టర్స్ సదుపాయాన్ని కూడా కల్పించారు.

క్రమశిక్షణ, ఉన్నత విద్యే మా లక్ష్యం..

గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని చక్కని పౌరులుగా తీర్చిదిద్దడానికి తనతోపాటు సిబ్బంది కూడా అహర్నిషలు కృషి చేస్తున్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం.

– దొప్పలపూడి శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్

ఇంతింతై వటుడింతై..

కాలుష్యానికి దూరంగా గురుకుల విద్యాపీఠ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. 1992 సంవత్సరంలో ఆరవై మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను చుక్కారామయ్య ప్రారంభించారు. పాఠశాలతోపాటు గొలపుడి రాందాస్ ట్రస్టును కూడా పాఠశాల యాజమాన్యం నడుపుతున్నది. ట్రస్టు ద్వారా పాఠశాల చుట్టుపక్కల గల ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధికి చేయూతనిస్తున్నారు. దీంతో అంచెలంచెలుగా ఎదిగిన పాఠశాల నేడు వెయ్యిమంది విద్యార్థులతో ముందుకు సాగుతున్నది. సుమారు ఇరవై ఐదు ఎకరాల్లో విశాలమైన తరగతి

భోజనం చేస్తున్న గురుకుల విద్యాపీఠం విద్యార్థులు

గదులు, చక్కని హాస్టల్ వసతిని ఏర్పాటు చేశారు. ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు ఇక్కడ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య..

ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు సమక్షంలో సిబ్బంది ఇరవై నాలుగు గంటలపాటు క్యాంపస్‌లోనే ఉంటూ చక్కని ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తున్నారు. శాస్త్రీయబద్ధంగా రూపొందించిన విషయప్రణాళికతో విద్యార్థులకు ఐఐటీ కోర్సులతో కూడిన శిక్షణను అందిస్తున్నారు. అలాగే, రాత్రి సమయాల్లో కూడా విద్యార్థులు చదువుకోవడానికి వసతిగృహంలోని ప్రతి బ్లాక్‌కు ఒక్కొక్క వార్డెన్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో అత్యాధునికమైన ప్రయోగశాలలెన్నో ఉన్నాయి. గ్రంథాలయాలూ ఉన్నాయి. అలాగే, విద్యార్థినీవిద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలను ఏర్పాటు చేశారు. విశాలమైన క్రీడామైదానాలు ఉన్నాయి.

30 ఏండ్ల ప్రస్థానం పూర్తిచేసుకుని..

గురుకుల విద్యాపీఠ్ ప్రారంభించి 30 సంవత్సరాలు దాటింది. ఈ పాఠశాలలో చదివిన ఇబ్రహీంపట్నానికి చెందిన నామిని వెంకటేశ్ అనే విద్యార్థి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అలాగే, అనేక మంది విద్యార్థినీవిద్యార్థులు వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో చదివిన అనేకమంది జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు.

ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలే..

ప్రతి ఏటా టెన్త్ పరీక్షల్లో ఈ గురుకుల విద్యాపీఠ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల్లో ఉన్న ప్రావీణ్యతను బట్టి వారి స్థాయిలో ఫీజులను నిర్వాహకులు తీసుకుంటున్నారు.

క్రీడలు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 140 ఫిర్యాదులొచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించడం జరిగిందని, అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో ఎంట్రీ సత్వ రమే పరిష్కరించాలన్నారు. కోర్టుకు సంబంధించిన కేసులకు తహసీల్దార్లు హాజరై వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో 250 ఫిర్యాదులు

వికారాబాద్, జూన్ 24 : ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరి ష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి 250 ఫిర్యాదులొచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుల్లో ధరణి, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్ తదితర దరఖాస్తులున్నాయి. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్‌జైన్ సోమవారం జిల్లా కోర్టు సముదాయంలోని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

–వికారాబాద్, జూన్ 24

బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ప్రతి శుక్రవారం స్కూళ్లపై సమీక్ష
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

జూమ్ ద్వారా సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు

వికారాబాద్, జూన్ 24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ బడిలోనూ 20 విద్యార్థులకు ఒక టాయిలెట్ ఏర్పాటు చేయాలన్నారు. వాటికి నిరంతరం నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వివరాలను బ్లాకులు, తరగతుల వారీగా నంబర్లతో కూడుకున్న ఫొటోలను సమర్పించాలని సూచించారు. అంతేకాకుండా తాగునీరు, ట్యూబ్‌లైట్స్, ఫ్యాన్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు కురిస్తే పాఠశాలల భవనాలపై నీరునిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు వీలుగా నిచ్చెనలు కొనుగోలు చేయాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి శుక్రవారం పాఠశాలలపై సమీక్ష సమావేశం ఉంటుందని.. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ విద్యాసంవత్సరంలో టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతాశాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈవో రేణుకా దేవి, ప్రత్యేకాధికారులు, ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, ఉమేశ్, మండల ప్రత్యేక అధికారులు రామ్‌రెడ్డి, దీపారెడ్డి, మల్లేశం, బాబు మోజెస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి మీ-సేవ నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు

వికారాబాద్ జిల్లా మార్పల్లి మండలంలో మీ-సేవా కేంద్రం నిర్వాహకుడు నిర్దేశించిన రుసుము కంటే ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ప్రజావాణిలో ఫిర్యాదు రాగా.. దానికి స్పందించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ వెంటనే సంబంధిత మీసేవ నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. జిల్లాలోని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన రుసుమునే వసూలు చేయాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు.

రేపు పాఠశాలల బంద్

పరిగి, జూన్ 24 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి గణేశ్ తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో బుక్స్, యూనిఫారాలు విక్రయిస్తున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో డీపీవో అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీపీవో సిబ్బందికి ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టొద్దని.. ఏమైనా పెండింగ్‌లో ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, డీపీవో సూపరింటెండెంట్ అధికారులు, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. –వికారాబాద్, జూన్ 24

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

వికారాబాద్, జూన్ 24 : 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్న బీజేవైఎం నాయకులపై జరిగిన దాడిని నిరసిస్తూ రేవంత్‌రెడ్డి సర్కారు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం ఇంటర్వ్యూలకు పిలవాలని.. గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీజీపీఎస్‌సీ ఎదుట బీజేవైఎం నాయకులు ధర్నా నిర్వహిస్తే వారిపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మెగా డీఎస్సీ వేసే వరకు నిరుద్యోగులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఉద్యమాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర లీడర్ అనిల్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు జగన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

పాలియేటివ్ కేర్ సెంటర్‌లో సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దామోదర్

రోగులకు మెరుగైన వైద్యమందించాలి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దామోదర్
- ఆలనా పాలియేటివ్ కేంద్రం పరిశీలన

చేవెళ్ల రూరల్, జూన్ 24 : రోగులకు మెరుగైన వైద్యమందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దామోదర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఆలనా పాలియేటివ్ కేర్ సెంటర్‌ను పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ.. గ్రామాల్లోని రోగుల పట్ల సిబ్బంది కరుణ, బాధ్యతతో మెలగాలని.. వారి కి సమయానికి వైద్యమందించాల న్నారు. బయటి రోగుల సేవలు పెంచాలని, రోజుకు ఓపీ కనీసం 20 మంది, హౌస్ విజిట్లలో రోజుకు 10 నుంచి 12 మందిని చూడాలన్నారు. సిబ్బం ది సమయపాలన పాటించాలన్నారు. సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష, ఎంపీహెచ్‌వో బలరాం, సిబ్బంది ఉన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష

డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీలతో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దామోదర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కార్యక్రమాలను లబ్ధిదారులకు అందేలా చూడాలని, ఓపీ సేవలు సక్రమంగా నిర్వహించడంతోపాటు గర్భిణులను పరీక్షించాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారా ల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

డిజిటలైజేషన్‌తో మెరుగైన విద్యుత్ సేవలు

మణికొండ, జూన్ 24 : విద్యుత్తు సరఫరా మెరుగుపరిచి ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ప్రతి విద్యుత్ స్తంభం సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తున్నామని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ ఎం.శివశంకర్ తెలిపారు. సోమవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించి సమాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈ శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆధునీకరించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ జ్ఞానేశ్వర్, సబ్ ఇంజినీర్ చెన్నారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

విద్యుత్తు డిజిటలైజేషన్ పనులను పరిశీలిస్తున్న ఇబ్రహీంబాగ్ డీఈ శివశంకర్

ప్రజలు పోలీసులకు సహకరించాలి

రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

షాబాద్, జూన్ 24 : శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రజలతో మమేకం కావాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను చేవెళ్ల ఏసీపీ కిషన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. మండలంలోని చందనవెల్లి, సీతారాంపూర్‌లలో పారిశ్రామికవాడలు ఉండడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ నివసిస్తున్నందున నేరాలు పెరిగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పనుల్లో పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో రాత్రిపూట పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు. మండలంలో పరిష్కారం కాని సమస్యలుంటే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐ కాంతారెడ్డి, ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వెంబడించి పట్టుకుని..

తాళ్లతో కట్టేసి..

- పండ్లు చోరీ చేశాడని బాలుడిని చితకబాదారు
- కేసారంలో వెలుగుచూసిన ఘటన

కేసు నమోదు

షాబాద్, జూన్ 24 : పండ్లు దొంగతనం చేశాడని బాలుడ్ని కట్టేసి చితకబాదిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కేసారం గ్రామానికి చెందిన ఏడోతరగతి చదివే బాలుడు బేగరి యాదగిరి తన మిత్రులతో కలిసి అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి ఇంట్లోకి శనివారం నాడు గోడ దూకి వెళ్లి జామపండ్లు కోశాడు. దీనిని గమనించిన మధుసూదన్‌రెడ్డి ఆ బాలుడ్ని వెంబడించి పట్టుకుని.. తాళ్లతో కట్టేసి చితకబాదాడు. మరుసటి రోజు బాలుడి తల్లిదండ్రులు ఎందుకు కొట్టావని అతడిని అడిగితే.. వృద్ధులమైన నన్ను, నా భార్యను తోసేసి మీ అబ్బాయి వెళ్లేందుకు ప్రయత్నించడం తోనే అలా చేశానని మధుసూదన్‌రెడ్డి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన బాలుడి తల్లి దండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి తల్లి అమృత ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

317 జీవో తర్వాత రంగారెడ్డి జిల్లాకు వివిధ కారణాలతో వచ్చిన టీచర్లను వెంటనే వారి వారి జిల్లాలకు పంపి.. పదోన్నతులు, బదిలీలను ప్రస్తుత షెడ్యూల్‌లోనే చేపట్టాలని ఎస్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, పీఆర్‌సీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బందయ్య, కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ జేఏసీ పిలుపుమేరకు సోమవారం మండల కేంద్రంలో 15 ప్రభుత్వ ఉన్నత, మూడు ప్రాథమికోన్నత, 49 ప్రాథమిక పాఠశాలల టీచర్లందరూ కలిసి నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్, ఎంఈవోకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, యూటీఎఫ్ సతీశ్, నర్సింహులు, ఎస్‌టీయూ బాలరాజ్, అబ్దుల్ హమీద్, నారాయణ, తపన్, వినోద్ పాల్గొన్నారు.

–మొయినాబాద్, జూన్ 24

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో ద్వారకను చేర్చాలి

ఖైరతాబాద్ : శ్రీకృష్ణుడు నిర్మించిన ద్వారక నగరాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలని ఇట్స్ సిక్స్ వావ్ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షాహిద్‌ఖాన్, రవీంద్రజిత్ పేర్కొన్నారు. ప్రపంచ చరిత్ర దినోత్సవం సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. సముద్రంలో నీట మునిగిన ద్వారకా నగరంపై అనేక పరిశోధనలు చేశామన్నారు.